సాక్షి
చిత్తూరు

శనివారం । 12 । జూలై । 2025



విత్తుకోని ఆశలు

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. - 8లో



ముగిసిన శిక్షణ

ఎస్వీ వైద్యకళాశాలలో బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ అంశంపై వైద్య అధ్యాపకులకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. - 8లో



వేదం..విజయనాదం

తిరుపతిలోని వేదిక్ యూనివర్సిటీ 20వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. - 8లో

న్యూస్‌రీల్

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చంద్రశేఖర్



చిత్తూరు అర్బన్: చిత్తూరుకు చెందిన న్యాయవాది ఎం.చంద్రశేఖర్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానానికి ఈయన మూడేళ్ల పాటు ఏపీపీగా కొనసాగనున్నారు. ఇందుకోసం నెలకు రూ.40 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేషనల్ అవార్డ్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు నేషనల్ అవార్డ్స్‌కు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారని డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2025 కు సంబంధించి జాతీయ పురస్కారాలు (నేషనల్ అవార్డ్స్)కు అర్హత, ఆసక్తి ఉన్న టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 13వ తేదీలోపు www.nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని సెల్ఫ్ నామినేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం హార్డ్ కాపీని డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఫైనల్ సబ్‌మిషన్ ఆఫ్ సెల్ఫ్ నామినేటెడ్ ది టీచర్ చివరి తేదీ ఈనెల 15 అని ఆమె వెల్లడించారు.

జిల్లా ఓటర్లు 15,71,402



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జూలై ఒకటవ తేదీ నాటికి 15,71,402 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఓటర్ల జాబితా సిద్ధం చేసి రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఓటర్ల జాబితా పై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10,615 మందికి ఓటర్ ఎపిక్ కార్డులను పంపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఆర్‌వో మోహన్‌కుమార్, పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, సురేంద్రకుమార్, అట్లూరి శ్రీనివాసులు, వాడ గంగరాజు పాల్గొన్నారు.

మంజూరైన పనులు చేయకపోతే రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జెడ్పీ, 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం క్షేత్రస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో జెడ్పీ, 15 వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. పనుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ఉండకూడదన్నారు. జిల్లాలోని 31 మండలాల్లో చేపడుతున్న తాగునీరు, మురుగునీటి కాలువలు, సిమెంట్ రోడ్లు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. నాణ్యతలో లోపం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంజూరై పనులు ప్రారంభం కాకపోతే రద్దు చేస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నెలకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసన్నా.. ఇదేందన్నా!

'పోలీసులు తన, మన తేడా లేకుండా వ్యవహరించాలి. రాజకీయాలతో సంబంధం లేకుండా శాంతి భద్రతలను పరిరక్షించాలి. ప్రజల ధన, మాన, ప్రాణాలకు పెద్ద పీట వేయాలి. నేరాల నియంత్రణకు కట్టుబడి పనిచేయాలి. పౌరుల హక్కులకు భంగం వాటిల్లకుండా సేవ చేయాలి..' కానీ కూటమి ప్రభుత్వంలో ఖాకీలు ఇలాంటివి పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ ప్రోద్బలంతో కక్ష సాధింపులకు దిగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ విధులు మరచి ప్రవర్తిస్తున్నారనే ఆపవాదులు ఎదురవుతున్నాయి. ఇలాంటి ఘటనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం పర్యటనలో ఎదురైందని ప్రజలు, రైతులు గళం విప్పుతున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఇంత కఠినంగా వ్యవహరించడంపై పెదవి విరుస్తున్నారు. పోలీసన్నా.. ఇదేందన్నా అంటూ నిట్టూర్పులు వెళ్లగక్కుతున్నారు.

జగన్ పర్యటనలో రైతులపై ఎందుకీ ఆంక్షలు

- పోలీసుల అణచివేతతోనే భారీగా జనం
- రక్షకభటులే ఇంత కఠినంగా వ్యవహరిస్తే ఎలా?
- ఖాకీల తీరును తప్పుబడుతున్న రైతన్నలు

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా రైతులపై పోలీసుల లాఠీ చార్జ్





బంగారుపాళెంలో రైతులపై విరుచుకుపడుతున్న పోలీసులు (ఫైల్)

పలమనేరు/కాణిపాకం: ప్రజలను రక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కానీ బుధవారం బంగారుపాళెంలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో ఎందుకు వారిపై ఇంత కఠినంగా వ్యవహరించారనే మాట సర్వత్రా వినిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారుపాళెంలోకి ప్రజలను వెళ్లనీయకుండా పోలీసులు ఎందుకిలా అడ్డుకున్నారనే మాట రైతుల్లో అయోమయాన్ని కల్గిస్తోంది. ఏ మార్గంలోనూ జనం వెళ్లకుండా ప్రత్యేక చెక్ పోస్టులు పెట్టి అడ్డుకున్నారు. ఎటుచూసినా కర్ఫ్యూ వాతావరణాన్ని సృష్టించారు. కనీసం నడిచి వెళుతున్న వారితోనూ దురుసుగా మాట్లాడారు. ద్విచక్ర వాహనాలకు పెట్రోలు బంకుల్లో పెట్రోలు పట్టనీయకుండా చేశారు. జగన్ పర్యనటలో భాగంగా కొన్ని చోట్ల గుమిగూడిన రైతులపై లాఠీతో విరుచుకుపడ్డారు. బంగారుపాళెం మార్కెట్లోని మామిడి రైతులను బయటకు పంపేశారు. వ్యాపారులు లేకుండా చేశారు. అసలు జనాన్ని చూస్తేనే పోలీసులు కోపంతో ఊగిపోయారు. మొత్తం మీద పోలీసులు చేసిన అణచివేత చర్యల కారణంగానే రైతులు వేలాదిగా ఈ కార్యక్రమానికి వచ్చేలా చేసిందనే మాట జనంలో వినిపిస్తోంది. పోలీసులు ఇన్ని రకాలుగా ఆంక్షలు పెట్టి ఉండకపోతే కార్యక్రమం ప్రశాంతంగానే జరిగిపోయేదని అంటున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై కొందరి రైతుల మాటల్లోనే..

మేమూ రైతులమే



మా కష్టాలు మాకు తెలుసు. మా కష్టాలు ఎవరికో ఒకరికి చెప్పుకుంటే తప్ప తీరదు. అలాంటప్పుడు ప్రభుత్వం ముందుకు రావాలి. రైతులను ఆదుకోవాలి. మా కష్టసుఖాలను వినాలి. అలా ఎవరు వచ్చినా కష్టాలను చెప్పుకోవడానికి రైతులు ముందు పడతాం. వస్తే అందుకు ఈ రకంగా చేస్తారా..? దారుణమండి. ఇలా చేయడం కరెక్టు కాదు. పోలీసులు మారాలి. కక్షపూరితమైన రాజకీయాలు వద్దు. మనుషులని చూడండి. రైతు కష్టాలను అన్ని శాఖల అధికారులకంటే.. పోలీసులే దగ్గరుండి చూశారు. మీలో కూడా రైతు కుటుంబాలు ఉన్నాయి..కదా. టోకన్ల కోసం ఎంత ఇబ్బంది పడ్డారో చూశారు కదా.. మళ్లెందుకు ఇలా చేశారు.

– పెద్దిరెడ్డి, రైతు, వేపంజేరి

ఇది ముమ్మాటికీ దౌర్జన్యమే



ఎన్ని అడ్డంకులు ఉన్నా వాటి ని అధిగమించి మా కష్టాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌తో పంచుకోవాలని పర్యటనకు వెళ్లాం. కనీసం ద్విచక్ర వాహనం కూడా వదలలేదు. ఎక్కడికక్కడ కట్టడి చేసి విఘాతం కలిగించారు. ఆయనకు వస్తున్న ప్రజాధరణను ఓర్వలేక కూటమి ప్రభుత్వం ఈ రకంగా హింసించింది. రైతులను అడ్డుకోవాలని శతవిధాల ప్రయత్నించింది. వాళ్లు ఏం చేసి నా జనబలాన్ని ఆపలేకపోయారు. ఇలా చేస్తే ప్రజా లే భవిష్యత్‌లో తీర్పునిస్తారు. ఏ అధికారమైనా జనబలం ముందు తలవంచాల్సిందే.. అనడానికి ఇదీ ఒక నిదర్శనం.

– వెంకటేష్, రైతు, జీడీనెల్లూరు

కేసులతో భయపెడతారా?



రైతులతో ఆటలొద్దు. మేము రోడ్డు మీదకు వస్తే మళ్లీ మా ముఖ్యంగా ఉండదు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంది. అది చేయలేకపోతే..ఇలా ప్రతిపక్షాలు రోడ్డుపైకి వస్తాయి. ఇదీ ఆయన సొంత కార్యక్రమం కాదు కదా. మామిడి రైతులు పడుతున్న కష్టాలను చూసి సమస్యలను వినేందుకు వచ్చారు. అందులో తప్పేంముంది. అడ్డకుంలు సృష్టించడంతో పాటు గొంతు కూడా నొక్కేస్తున్నారు. కేసుల పేరుతో భయపెట్టడం న్యాయం కాదు.

– ఉమాచంద్ర, రైతు నాయకులు

ఆదరణ చూసి ఓర్వలేక



ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఇచ్చిన హామీల విషయంలో మాట దాట వేసింది. రైతులకు చేసిందేమీ లేదు. వేరుశనగ పంట పూర్తిగా నేటమట్టమైంది. మామిడి రైతులు మద్దతు ధర లేక రోడ్డుపై అల్లాడుతున్నాము. అయితే ఈ రోదనను వినేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పర్యటనను అడ్డుకోవడం సరి కాదు. కూటమి ప్రభుత్వం ఆయన ఆదరణ చూసి ఓర్వలేకపోతోంది. అందుకే ఈ రకంగా రైతులను, జనాన్ని రాకుండా తొక్కిపడేస్తోంది. వాళ్లు ఎంత తొక్కితే అంతా పైకి లేస్తాం.

– రవీంద్రనాథ్, రైతు నాయకులు

కర్షకులపై కర్కశమా?



కూటమి ప్రభుత్వం రైతులను కట్టడి చేసింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకట్టలు వేసింది. పోలీసులతో నిలువరించింది. తెల్లచొక్కా, రైతు కండువ కనిపిస్తే చాలు పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. తమ సమస్యను మాజీ ముఖ్యమంత్రికి చెప్పుకోవాలని వెళితే తప్పా..? సమస్యలు చెప్పుకుందామని నడుచుకుని వచ్చాం. అడ్డదారులో చేరాం. రాళ్ల రప్పలను లెక్క చేయలేదు. మాజీ ముఖ్యమంత్రి చెంత మామిడి కష్టాలను కన్నీళ్లతో వెలిబుచ్చాం. కర్షకులపై ఇంత కర్కశం పనికిరాదు.

– వెంకటరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

శత్రువులా చూశారు



జగన్‌మోహన్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి అండి. ఆయనొస్తే..వీళ్లకెందుకు నొప్పి. కూటమి ప్రభుత్వం ప్రజాధరణతోనే గెలిచింది కదా. అలాంటప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి వెళితే మీకేంటి?.. దానికి ఇంత రాద్ధాంతం చేయలా..?. ఇంతటి దౌర్జన్యం చేసినా రైతులు గుండెనిండా అభిమానంతో జగన్‌మోహన్‌రెడ్డిని కలవాలని వచ్చారు. ఆ అభిమానాన్ని ఎవరూ ఆపలేరు. పోలీసులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రైతులను శత్రువులను చూసినట్లు చూశారు.

– పద్మనాభరెడ్డి, రైతు నాయకులు



మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

దేవదాయ భూములను పరిరక్షించాలి



మాట్లాడుతున్న డీఆర్‌వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా దేవదాయ భూములను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌వో మోహన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో దేవదాయ భూముల పరిరక్షణ పై జిల్లా స్థాయి భూ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 17,540 ఎకరాల దేవలయ భూములున్నాయన్నారు. ఈ భూములన్నింటినీ సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్‌లెతై వెంటనే గుర్తించి తొలగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,343.17 ఎకరాల దేవదాయ భూములు ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇందులో ఏవైనా కోర్టు కేసుల్లో ఉన్నట్‌లెతై స్టే వెకేషన్‌కు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 9,761 ఎకరాలకుగాను 4,866 ఎకరాల భూములు 1 బీ అడంగళ్‌లో దేవదాయ పేర్లుగా నమోదు చేశారన్నారు. 5,500 ఎకరాలకు 1 బీలో పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకా 2,200 ఎకరాల భూములను వెంటనే 1 బీ అడంగల్‌లో నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దేవదాయ భూములను తక్కువ ధరకు వేలంలో లీజుకు ఇస్తున్నారని తమ దృష్టికి ఫిర్యాదులు వచ్చాయన్నారు. వివాదాస్పద భూములన్నింటినీ సర్వే చేయించాలని సూచించారు. జాయింట్ సర్వే పెండింగ్‌లో ఉన్న భూములను ఆయా శాఖల సమన్వయంతో 30 రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ చిట్టెమ్మ పాల్గొన్నారు.

ప్రగతి పురోగతిపై సమీక్ష

తిరుమల : తిరుమలలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై శుక్రవారం అన్నమయ్యభవన్‌లో టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సమీక్షించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నిర్దేశిత గడువులోపు పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీ కృష్ణ, డీఎఫ్ఓ ఫణి కుమార్ నాయుడు, సీఈ సత్య నారాయణ, ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఐటీ జీఎం శేషారెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారి రాముడు, డిప్యూటీ ఈఓలు భాస్కర్, సోమన్నారాయణ పాల్గొన్నారు.

పనుల నిర్వహణలో అలసత్వం వద్దు



సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్ మస్తానయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న సివిల్ వర్క్స్ నిర్వహణలో అలసత్వం వద్దని సమగ్రశిక్ష అధికారులపై ఎస్‌ఐఈఎంఏటీ (స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్) డైరెక్టర్ మస్తానయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన శుక్రవారం ఆకస్మికంగా సమగ్రశిక్ష కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సమగ్రశిక్ష, విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమగ్రశిక్ష అధికారులు విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సమీక్షలో జిల్లా ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వెంకటరమణ, ఇంజినీరింగ్ విభాగం డీఈ మధుసూదనరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేట్లు పెంచాలి


రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : మధ్యాహ్న భోజన పథకం రేట్లు పెంచాలని వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు 2022 అక్టోబర్ 1వ తేదీ నుంచి కేంద్రం రూ.5.45 చొప్పున మధ్యాహ్న భోజన ధరలను నిర్ణయించిందన్నారు. అయితే ఆ నగదుకు అధనంగా రాష్ట్ర ప్రభుత్వం కుకింగ్ కాస్ట్ గా రూ.0.43ను మంజూరు చేస్తూ మొత్తం రూ.5.88గా నిర్ణయించినట్టు తెలిపారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కేంద్రం రూ.8.17 నిర్ణయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.40 పైసలు మొత్తం రూ.8.57 గా నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో రూ.6.19, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రూ.9.26 చొప్పున కేంద్రం పెంచిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కేంద్రం పెంచిన ఉత్తర్వ్యులను అమలు చేయకుండా మీనామేషాలు లెక్కిస్తోందన్నారు. పెరిగిన కుకింగ్ కాస్ట్‌ను అమలు చేయకుండా పాతరేట్లు అమలు చేయడం తగదన్నారు. వెంటనే కొత్త ఎండీఎం రేట్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భోజనం తయారీ కార్మికులకు కనీస వేతనంగా రూ.5 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు విశ్వంలో ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి అవగాహన సదస్సును ఉచితంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు 4 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

14న కేంద్ర బృందం రాక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమ అమలుపై సోమవారం కేంద్ర బృందం అధికారి భవాన్ సింగ్ పర్యటించనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. ఉదయం 9గంటలకు ఆయన జిల్లాకు చేరుకోనున్నారన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో టీబీ ముక్త భారత్ కార్యక్రమ అమలు తీరును పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అలాగే టీబీ సెంటర్లను పరిశీలించనున్నట్టు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 63,473 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

‘విత్తు’కోని ఆశలు

- వర్షాభావంతో అదును దాటుతున్న వైనం
- ఈ దఫా భారీగా తగ్గనున్న వేరుశనగ సాగు విస్తీర్ణం

పలమనేరు: వేరుశనగ రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి. సాధారణంగా జూలై తొలి వారానికల్లా ఇక్కడ వేరుశనగ విత్తనాలేసే పనులు పూర్తికావాల్సి ఉంటుంది. కానీ ఇప్పటిదాకా వరుణుడు కరుణించకపోవడంతో చేలల్లో విత్తనాలు పడలేదు. ఎక్కడో వెతికినా దొరకనట్టు ఓ శాతం మాత్రం వేసిన విత్తనాలు మొలకెత్తినా అవీ వర్షం లేక మాడిపోతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఈ దఫా జిల్లాలో వేరుశనగ సాగు విస్తీర్ణం భారీగా తగ్గే అవకాశం ఉంది.

ఆశలే వదేలుకోవాల్సిందేనా?

పదేళ్ల క్రితం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.2 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాధారణ సాగుగా ఉండేది. ఏటా పంటసాగు తగ్గుతూ వస్తోంది. జిల్లా విభజన జరిగాక పంట సాధారణ సాగు 55 వేల హెక్టార్లకు పడిపోయింది. ప్రస్తుతం సాధారణ సాగు 35 వేల హెక్టార్లకు దిగజారిపోయింది. ఈ దఫా సకాలంలో వానలు పడుంటే పంట సాగు 20వేల హెక్టార్లు దాకా ఉండొచ్చునని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ సీజన్ ముగుస్తున్నా వరుణుడు కరుణించ లేదు. ఈ దఫా వేరుశనగ పంటపై రైతులు ఆశలు వదులుకోవాల్సిందేనన్న మాటలు వినిపిస్తున్నాయి.


బైరెడ్డిపల్లి మండలం శెట్టిపల్లి వద్ద ఎండుతున్న వేరుశనగ మొలకలు

సాగుచేసినా నష్టాలు తప్పవా?

గత కొన్నేళ్లుగా వేరుశనగను రైతులు సాగుచేయడం తగ్గించారు. ఇందుకు ప్రధాన కారణం పంటకు పెట్టిన పెట్టుబడి సైతం దక్కడం లేదు. సకాలంలో వర్షాలు రాకపోవడం, లేదా ఎక్కువగా వర్షాలు పడి పంటకు నష్టం జరుగుతుండడంతో రైతులు వేరుశనగ సాగుపై ఆశలు వదులుకుంటున్నారు. పంట దిగుబడులు సైతం ఎకరానికి నాలుగైదు బస్తాలు కూడా కావడం లేదు. ఎకరా పొలంలో పంట సాగుకు రూ.15వేల దాకా అయితే దిగుబడి 5వేలు కూడా రావడం లేదు. దీంతో రైతులు వేరుశనగ పంటపై ఆసక్తిని చూపడం లేదని తెలుస్తోంది. బస్తా (30కేజీలకు) రూ.1116 సబ్సిడీగా వస్తుందని చాలామంది రైతులు విత్తనాలను తీసుకున్నారు. కానీ వర్షాలు లేక సీజన్ ముగుస్తుండడంతో వీటిని అమ్ముకోవడం .. లేదా ఇళ్లకు వాడుకోవడం చేసుకోవాల్సిందే.

ఈ దఫా సీజన్ పోయినట్టే!

సాధారణంగా వేరుశనగ విత్తనాలకు జూన్ 15 నుంచి జూలై తొలివారంలోగా చేలల్లో వేయాలి. ఈ సీజన్‌లో వేస్తేనే పంట దిగుబడి వస్తుంది. ఇప్పటిదాకా వర్షాలు పడలేదు. దీంతో 90 శాతంపైగా చేలు బీళ్లుగానే ఉన్నాయి. పది శాతం మంది రైతులు వేసవి దుక్కులు చేసుకున్నా విత్తనాలేసేందుకు అవకాశం లేకుండా పోయింది. సిద్ధం చేసుకున్న విత్తనాలు వర్షం కోసం ఎదరుచూస్తున్నాయి.


వాన కోసం ఎదురుచూస్తున్న దుక్కులు

జిల్లా వేరుశనగ సాగు వివరాలు

సాధరణ సాగు విస్తీర్ణం :	35,228 హెక్టార్లు
ఖరీఫ్‌లో పంటను సాగు చేసే రైతులు :	90 వేల మంది దాకా
అవసరమైన విత్తనకాయలు :	50 వేల క్వింటాళ్లు
కూటమి ప్రభుత్వంలో అందినవి :	39 వేల క్వింటాళ్లు
ఇప్పటిదాకా సాగైన వేరుశనగ విస్తీర్ణం :	300 హెక్టార్లు

విత్తనాలే ఇవ్వలేదు



విత్తనాలేసేందుకు వాన లేదు. సరే కనీసం విత్తనాలను సైతం ఇవ్వలేదు. మాకు కొంగోళ్ల పల్లి, మామొడుగు గ్రామాల్లో ఆరెకరాల భూములున్నాయి. రెండుచోట్ల రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలడిగినా లేవని చెప్పారు. వచ్చిన విత్తనాలను ఎవరు తీసుకున్నారో దేవుడికే తెలియాలి.

– నాగరాజరెడ్డి, రైతు, కొంగోళ్లపల్లి, గంగవరం మండలం

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం



మరో వారం రోజుల దాకా విత్తనాలేసేందుకు సీజన్ ఉంది. అప్పటిదాకా వర్షం పడకుంటే ఆపై ఏమీచేయను కాదు. అందుకే ప్రత్యామ్నాయంగా వేరుశనగ పొలాల్లో ఉలవ సాగుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పలమనేరు డివిజన్‌కు మాత్రమే 80 వేల క్వింటాళ్ల ఉలవ విత్తనాలకు ఇండెంట్ చేశాం. జిల్లాలో ఎక్కడా వర్షాలు లేవు. వేరుశనగ సాగు భారీగా తగ్గే అవకాశం ఉంది.

– గీతాకుమారి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, పలమనేరు

వైద్య అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో నిరంతర వైద్య విద్యలో భాగంగా బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ అంశంపై వైద్య అధ్యాపకులకు మూడు రోజులగా నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ.. మూడు రోజులుగా వైద్య నిపుణులతో వైద్య విద్య బోధనా పద్ధతులు, వైద్య విద్యార్థులకు ఉన్నత విద్యలో తీసుకోవాల్సిన ప్రధాన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రాధ, వేలూరు సీఎంసీ వైద్య కళాశాల అబ్జర్వర్స్ డాక్టర్ మినురేఖ, డాక్టర్ భోధన రాజన్, అకడమిక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కిరీటి, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీలాదేవి, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ సత్యానారాయణ మూర్తి, వైద్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

20న తిరుపతిలో ఓపెన్ చెస్ టోర్నీ

తిరుపతి తుడా : ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన మెడికల్ కాలేజీ నందు ఓపెన్ చెస్ టోర్నీ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తుడా చైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్స్ దివాకర్ రెడ్డి ఆవిష్కరించారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు, అన్ని వయస్సుల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, బాలాజీ చౌదరీ, శ్రీనివాస సూరి పాల్గొన్నారు.

వేదం.. విజయనాదం

- దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ చలువతో వేదిక్ వర్సిటీ
- నేడు వేదిక్ వర్సిటీ 20వ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి సిటీ : వేద విద్యను విస్తృతం చేసి వేదాల సారాంశాన్ని, జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో వేద విద్యకు ప్రత్యేక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచించారు. ఇందులో భాగంగా 2006లో టీటీడీ ఆధ్వర్యంలో వేద పండితులు, పీఠాధిపతులు సలహాలతో అలిపిరి జూపార్క్ రోడ్డు సమీపంలో శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

19 విభాగాలలో..

వర్సిటీ ఏర్పాటు చేసిన తొలి ఏడాది నుంచి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వేద విద్యను అభ్యసించేందుకు వందల సంఖ్యలో విద్యార్థులు వేదిక్ వర్సిటీలో అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం సుమారు 19 విభాగాలలో వర్సిటీ వేద విద్యను అందిస్తోంది. వేద విభాగంలో రుగ్వేద, కృష్ణ యజుర్వేద, శుక్ల యజుర్వేద, సామవేద, అధర్వణ వేదం, ఆగమ శాస్త్ర విభాగాలలో వైఖానస, పంచరత్ర, శైవాగమం, పౌరోహిత్యం విభాగాలలో ఆశ్వాలయన, అపస్తంభ, పరస్కర, వేద భాష్యంలోని 5 విభాగాలలో, కల్ప, మీమాంస విభాగాలలో 15 చొప్పున అడ్మిషన్లు చేపట్టి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులలో ప్రతి ఏడాది ఒక్కో విభాగంలో ప్రత్యేక నిపుణులైన వేద పండితులతో శిక్షణ ఇస్తున్నారు. సంస్కృత పరిజ్ఞానం కలిగిన విద్యార్థులకు ఏడు విభాగాలలో సర్టిఫికెట్ కోర్సులను సైతం వర్సిటీలో అందుబాటులో ఉంచారు.



ఎస్వీ వేదిక్ వర్సిటీని ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ (ఫైల్)

ఉపాధి కల్పనే లక్ష్యంగా అడుగులు

వేదిక్ వర్సిటీలో విద్యనభ్యసించి పీజీ, యూజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు వంద శాతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. దేశ, విదేశాలలోని పలు ఆలయాలలో పండితులు, పూజారులుగా, సలహాదారులుగా వందల మంది వర్సిటీ విద్యార్థులు ఉన్నత స్థాయిలో పనిచేస్తున్నారు. టీటీడీ విద్యాసంస్థలలో అధ్యాపకులుగా, ఆలయాలలో పండితులుగా రాణిస్తున్నారు. అలాగే అయోధ్యలోని రామాలయంలో సైతం వేదిక్ వర్సిటీ విద్యార్థులు ఉన్నత స్థానాలలో పనిచేస్తుండటం వర్సిటీకి గర్వకారణంగా చెప్పవచ్చు.

నేడు వర్సిటీ 20వ వ్యవస్థాపక వేడుకలు

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసి 20 ఏళ్లు నిండిన సందర్భంగా శనివారం వర్సిటీలోని సంధ్యావందన శాలలో వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరపనున్నారు. వీసీ రాణి సదాశివమూర్తి అధ్యక్షతన రిజిస్ట్రార్ భాస్కరుడు పర్యవేక్షణలో నిర్వహించనున్న వ్యవస్థాపక దినోత్సవానికి టీటీడీ అధికారులు, బోర్డు సభ్యులు హాజరుకానున్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు



చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా అనుబంధ విభాగాల్లో పలువురిని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం వివరాలను ప్రకటించింది.

సోషల్ మీడియా

- జిల్లా ఉపాధ్యక్షులుగా ఈ.అనిల్‌కుమార్‌రెడ్డి(తిరుపతి), ఎ.భానుప్రకాష్(చిత్తూరు), ప్రధాన కార్యదర్శులుగా డి.షణ్ముగంరాయల్(తిరుపతి), ఈశ్వర్‌రెడ్డి(పుంగనూరు), ప్రదీప్‌రెడ్డి(చిత్తూరు), యోగానందరెడ్డి(చంద్రగిరి), శోభన్‌కుమార్(సత్యవేడు), కార్తీక్‌రెడ్డి(జీడీనెల్లూరు), ఎస్.మురుగేష్(తిరుపతి), కార్యదర్శులుగా జి.రమేష్(కుప్పం), అరుణ్‌కుమార్(చిత్తూరు), మహేష్‌రెడ్డి(పుంగనూరు), హరిప్రసాద్(తిరుపతి), ఈశ్వర్(పలమనేరు), మదన్(జీడీనెల్లూరు), ఈసీ మెంబర్లుగా 18 మందిని నియమించారు.

యువజన విభాగం

- జిల్లా ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యంనాయుడు (పలమనేరు), రూపేష్‌రెడ్డి(చిత్తూరు), ప్రభురాజ్(నగరి), ఆఫ్రిడ్ మాలిక్(పుంగనూరు), ప్రధాన కార్యదర్శులుగా దిలీప్‌యాదవ్(శ్రీకాళహస్తి), మోహన్‌వంశీ(తిరుపతి), పి.శివ(పుంగనూరు), నవీన్‌కుమార్‌రెడ్డి(జీడీనెల్లూరు), శశీంద్ర(తిరుపతి), మనోహర్‌రెడ్డి(చంద్రగిరి), మునివెంకట లోకేష్(తిరుపతి), షేక్‌బావాజీ(పుంగనూరు), వంశీకృష్ణ(పూతలపట్టు), కార్యదర్శులుగా శేషాద్రిరెడ్డి(జీడీనెల్లూరు), రమేష్(సత్యవేడు), రెడ్డిప్రసాద్(పలమనేరు), ధనుంజయరెడ్డి(చంద్రగిరి), సుధీర్(తిరుపతి), హేమంత్‌కుమార్‌రెడ్డి(కుప్పం), ఈసీ మెంబర్లుగా 16 మందని నియమించారు.

విద్యార్థి విభాగం

- జిల్లా ఉపాధ్యక్షులుగా శశిదీప్(చిత్తూరు), సోమశేఖర్(కుప్పం), ప్రధాన కార్యదర్శులుగా మహేష్‌చౌదరి(చిత్తూరు), మహేష్(జీడీనెల్లూరు), మధుసూదన్‌రెడ్డి(తిరుపతి), భానుప్రకాష్‌రెడ్డి(చంద్రగిరి), వీరమణి(కుప్పం), కార్యదర్శులుగా అజిత్‌కుమార్(చిత్తూరు), అశ్విత్(పలమనేరు), వేణురెడ్డి(జీడీనెల్లూరు), ప్రదీప్‌కుమార్(తిరుపతి), పృధ్వీరెడ్డి, సుధీర్‌రెడ్డి, దినేష్, నరేష్‌బాబు(చంద్రగిరి), ఈసీ మెంబర్లుగా 11 మందిని నియమించారు.

వాణిజ్య విభాగం

- జిల్లా ఉపాధ్యక్షులుగా రూపేష్ కుమార్‌రెడ్డి(తిరుపతి), ప్రసాద్(చంద్రగిరి), ప్రధాన కార్యదర్శులుగా రాధికరెడ్డి(జీడీనెల్లూరు), విజయరెడ్డి(తిరుపతి), రవి(కుప్పం), రమేష్(తిరుపతి), కార్యదర్శులుగా పెద్దన్న (కుప్పం), రోహిత్‌బుచ్చిరెడ్డి(చిత్తూరు), సుబ్రమణ్యంరెడ్డి(జీడీనెల్లూరు), అమర్‌నాథ్‌రెడ్డి(పలమనేరు), చలపతి, మంజూరు, కిషోర్(పుంగనూరు), జీవరత్నం (తిరుపతి), ఈసీ మెంబర్లుగా 19 మందిని నియమించారు.

వైఎస్సార్‌టీయూసీ

- జిల్లా ఉపాధ్యక్షులుగా తిరుమలరెడ్డి(తిరుపతి), షేక్ ఫిరోజ్‌అహ్మద్(పూతలపట్టు), ప్రధాన కార్యదర్శులుగా వెంకటేష్(జీడీనెల్లూరు), ఎం.బాబు(నగరి), శ్రీమంతుల రామయ్య(తిరుపతి), సుబ్రమణ్యంరెడ్డి(చంద్రగిరి), వేణుగోపాల్(కుప్పం), కోటేశ్వరరావు(చంద్రగిరి), కార్యదర్శులుగా శ్రీనివాసులు(పలమనేరు), రఘు(పూతలపట్టు), మునికృష్ణరెడ్డి(జీడీనెల్లూరు), మాంగండన్(నగరి), వెంకటముని(చిన్ని)(తిరుపతి), జి.కోటేశ్వరరావు(సత్యవేడు), సురేష్(శ్రీకాళహస్తి), ఈసీ మెంబర్లుగా 16 మందిని నియమించారు.

వలంటీర్ల విభాగం

- జిల్లా ప్రధాన కార్యదర్శులుగా జయచంద్ర(తిరుపతి), అబ్దులజైలా(జీడీనెల్లూరు),బోస్‌రెడ్డి(చంద్రగిరి),శివలింగం(కుప్పం),బాలసుబ్రమణ్యం(సత్యవేడు), కార్యదర్శులుగా పి.వరదరాజన్, పురుషోత్తం(తిరుపతి), రాము (జీడీనెల్లూరు), మనోహర్(శ్రీకాళహస్తి), ప్రభాకర్‌రెడ్డి(పలమనేరు), ఈసీ మెంబర్లుగా 18 మందిని నియమించారు.

చేనేత విభాగం

- జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏలుమలై(తిరుపతి), ప్రధాన కార్యదర్శులుగా రవిరెడ్డి(జీడీనెల్లూరు), పి.చంద్రోశేఖర్(తిరుపతి), సుధాకర్, మునిరాజా(శ్రీకాళహస్తి), విజయ్‌భాస్కర్(సత్యవేడు), కార్యదర్శులుగా రమేష్‌రెడ్డి(పలమనేరు), తిరుమల(జీడీనెల్లూరు), కన్నాయిరం(నగరి), వెంకటేష్(కుప్పం), అమరలింగయ్య(సత్యవేడు), నలుగురిని ఈసీ మెంబర్లుగా నియమించారు.

నిందితుడికి మూడేళ్ల జైలు

చిత్తూరు అర్బన్: బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం స్థానిక జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి శంకర రావు తీర్పునిచ్చారు. ప్రత్యేక పీపీ మోహనకుమారి కథనం మేరకు వివరాలిలా.. మదనపల్లెకు చెందిన చంద్రోశేఖర్(52) చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఈ క్రమంలో మదనపల్లె బాలికోన్నత పాఠశాల వద్దకెళ్లి.. పిల్లల పట్ల అసభ్యకరంగా వ్యవహరించేవాడు. దీనిపై 2017లో పాఠశాల హెచ్‌ఎం పద్మజ మదనపల్లె ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు చంద్రోశేఖర్ పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఎన్‌ఐఏబీతో వెటర్నరీ వర్సిటీ ఒప్పందం

తిరుపతి సిటీ : హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అనిమల్ బయో టెక్నాలజీ (ఎన్ఐఏబీ)తో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పలు అంశాలపై ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం వర్సిటీలో జరిగిన ఒప్పందంపై వీసీ ప్రొఫెసర్ రమణ, ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ తారు శర్మ సంతకాలు చేసి ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. జంతు సంరక్షణ, ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎన్ఐఏబీ సంస్థతో వర్సిటీ పలు అంశాలపై ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ప్రధానంగా నాణ్యమైన విద్య, నూతన పరిశోధనలు, విద్యా మార్పిడి వంటి విషయాలపై సహాయ సహకారాలు అందిపుచ్చుకోవడమే ఎంఓయూ లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, డీన్, అధికారులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీ, ఎన్ఐఏబీ డైరెక్టర్

నేటి నుంచి గ్రాప్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బైరాగిపట్టెడలోని గిరిజన భవన్‌లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అండర్–11, 13, 15, 17 కేటగిరిలో బాల బాలికలకు నిర్వహించనున్న ఈ పోటీలను శనివారం ప్రారంభించనున్నారు. ఆ మేరకు రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఏజీ.రేఖారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని, ఆయా విభాగాల్లో గెలుపొందిన బాల బాలికలు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, బిలాస్‌పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు.

తిరుమలకు వెళ్లి వచ్చేసరికే ఇల్లు గుల్ల

5 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ

చిల్లకూరు : తిరుమలలో జరిగే గరుడ సేవకు కుటుంబ సభ్యులు వెళ్లి వచ్చేసరికే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి దూరి 5 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన నల్లయగారిపాళెంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని నల్లాయగారిపాళెం గ్రామానికి చెందిన మస్తానయ్య గురువారం తిరుమలకు వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 5 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడం చూసిన పక్కనే ఉన్న బంధువులు గమనించి తిరుమలలోని మస్తానయ్యకు దొంగతనం జరిగినట్లు సమాచారం అందించారు. దీంతో ఆయన ఫోన్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబుతో పాటు క్లూస్ టీం చేరుకుని వేలి ముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘రూసా’ పనులు వేగవంతం చేయాలి

తిరుపతి సిటీ : రుసా ప్రాజెక్ట్ కింద అమలు చేస్తున్న పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రుసా) పథకం కింద జరుగుతున్న ప్రాజెక్టుల పురోగతిని అంచనా వేయడానికి ఎస్వీయూలో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం వర్సిటీ వీసీ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. వర్సిటీలో మౌలిక సదుపాయాలు, విద్యా, పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా వీసీ అప్పారావు వర్సిటీలో రూసా పథకం కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. అనంతరం రూసా కోర్డినేటర్ ప్రొఫెసర్ రమశ్రీ వర్సిటీలో జరిగే పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, రుసా సీఈఓ, ఆర్థిక, అభివృద్ధి విభాగాల కీలక అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు, వీసీ అప్పారావు

ఐషర్‌ను ఢీకొన్న బైక్

చంద్రగిరి : ఎదురుగా టమాట లోడుతో వస్తున్న ఐషర్ లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలైన ఘటన తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి పీటీసీ సమీపంలోని ఘాట్ రోడ్డు మలుపు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. భాకరాపేటకు చెందిన మహబూబ్ బాషా(58) మండల పరిధిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో పీటీసీ సమీపంలోని పెద్ద మలుపు వద్ద వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న టమాట లోడుతో వస్తున్న ఐషర్ వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో బైక్‌తో పాటు ఐషర్ వాహనం అదుపుతప్పి కల్వర్టు పక్కన ఉన్న భారీ లోతు ప్రాంతంలో బోల్తా పడడంతో టమాటా బాక్స్‌లు , బైక్ మహబూబ్ బాషాపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఐషర్ వాహనంలోని డ్రైవరుతో పాటు క్లీనర్ గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన మహబూబ్ బాషా